క్లుప్తంగా

మండల ప్రత్యేకాధికారిగా సత్యరమేష్

రంగంపేట: మండల ప్రత్యేకాధికారిగా జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి పి.సత్యరమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ మండల ప్రత్యేకాధికారిగా విధులు నిర్వహించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి.బాల శంకర్ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మండల అధికారులతో సత్యరమేష్ మాట్లాడుతూ సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి పాటుపడదామన్నారు. సత్యరమేష్‌కు తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం.దొరకయ్య, పీఆర్ జేఈ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు మెగా వైద్యశిబిరం

మధురపూడి: కోరుకొండ మండలం గాదరాడ గ్రామంలో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. స్థానిక హైస్కూల్ ఆవరణలో జరిగే ఈ శిబిరంలో జీఎస్ఎల్, సుభద్ర హాస్పిటల్స్ సౌజన్యంతో 40 మంది వైద్యులు సేవలందిస్తారు.

కృష్ణునిపాలెంలో పొలంబడి

గోకవరం: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఏఓ రాజేశ్వరి సూచించారు. మండలంలోని కృష్ణునిపాలెంలో శుక్రవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.

మగ్గం వర్క్ శిక్షణ ప్రారంభం

రాజానగరం: పాతతుంగపాడులో మగ్గంవర్కులో శిక్షణ కార్యక్రమాన్ని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వ్రరావు శుక్రవారం ప్రారంభించారు. శిక్షణకు అవసరమైన మెటీరియల్‌ను కూడా పంపిణీ చేశారు. ఈవూరి దుర్గ శిక్షకురాలిగా వ్యవహరిస్తారన్నారు. ట్రస్టు సభ్యులు సుంకర వీరాస్వామి, నాగేశ్వ్రరావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బిక్కవోలు: స్థానిక బ్రిడ్జి సెంటర్లో శుక్రవారం వాహన తనిఖీలు చేసి రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 2,200 కిలోల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

ధ్రువీకరణ పత్రాల పంపిణీ

మధురపూడి: కోరుకొండ మండలంలోని గాడాల, నిడిగట్ల గ్రామ సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి జగన్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కోకన్వీనర్ గణేశుల పోసి, సర్పంచుల సమాఖ్య మండలాధ్యక్షుడు కడియాల పాపారావు, నాయకులు చాటపర్తి దుర్గారావు, కొండపల్లి దుర్గారావు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి

రాజానగరం: ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు విద్యార్థులు నిరంతరం కృషి చేయాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు పిలుపునిచ్చారు. కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సీఎస్ఈ ఫైనలియర్ విద్యార్థులు శుక్రవారం నిర్వహించిన ఫేర్‌వెల్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇక్కడ ఇంజినీరింగ్ పూర్తి చేసి బయటకు వెళ్లిన ప్రతి ఒక్కరూ ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. క్యాంపస్‌లో ఇంజినీరింగ్ విద్యకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వ్రరావు, హెచ్ఓడీ డాక్టర్ బి.కెజియారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నందనవనంగా తీర్చిదిద్దుతాం


నన్నయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణాన్ని రానున్న రెండేళ్లలో నందనవనంగా తీర్చిదిద్దుతామని ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. వీసీ ఆచార్య కె.పద్మరాజు ఆహ్వానం మేరకు యూనివర్సిటీని శుక్రవారం సందర్శించిన ఆయన.. ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించడం అలవర్చుకోవాలని సూచించారు. తమ ట్రస్టు ఆధ్వర్యంలో 'నా మొక్క – నా శ్వాస' నినాదంతో పలు ప్రాంతాలలో విస్తారంగా మొక్కలు నాటుతున్నామన్నారు. హుదూద్ తుపాను అనంతరం విశాఖపట్నంలో 'మేక్ వైజాగ్ గ్రీన్' పేరుతో రెండువేల మొక్కలు నాటామన్నారు. వీసీ ఆచార్య పద్మరాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు డాక్టర్ ఉమర్ ఆలీషా ట్రస్టు ద్వారా చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. నన్నయ వర్సిటీలో 500 మొక్కలు నాటి, రెండేళ్లపాటు వాటి సంరక్షణ బాధ్యతలను ట్రస్టు తీసుకుంటామనడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గోదావరి ఎగపోటు.. పొలాలకు చేటు

- కోరుకొండ, సీతానగరం మండలాల్లో పరిస్థితి
- 5 వేల ఎకరాల్లో వరిపంట మునక


బూరుగుపూడి- గుమ్ములూరు మధ్య ముంపు బారిన పంటలు


బుచ్చెంపేట- గుమ్ములూరు మధ్య మునిగిన గెద్దబాడవ పొలాలు

మధురపూడి: గోదావరి వరద నీరు కాలువల ద్వారా కోరుకొండ, సీతానగరం మండలాల్లోని లోతట్టు ప్రాంతాల పంట పొలాలను ముంచెత్తుతోంది. మరోవైపు జిల్లాలో భారీగా వర్షాలు కురవడం కూడా సమస్యకు కారణమవుతోంది. గోదావరి ఉధృతి తగ్గినప్పటికీ ఎగపోటు సమస్య తీవ్రత తగ్గదు. ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ నుంచి వేల క్యూసెక్కుల మిగులు జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. అయినా వరదనీరు ఈ లోతట్టు ప్రాంతాలకు చేరుతోంది. బొబ్బిల్లంకలోని తొర్రిగెడ్డ కాలువ నుంచి వరద నీరు సీతానగరం, కోరుకొండ మండలాలకు చేరుతోంది. ఇప్పటికే బుచ్చెంపేట, గుమ్ములూరు, బూరుగుపూడి, మునగాల, శ్రీరంగపట్నం, కాపవరం గ్రామాల్లోని పొలాలు ముంపునకు గురయ్యాయి. చేలన్నీ చెరువుల్లా దర్శనమిస్తున్నాయి.

మెట్ట ప్రాంతంలో..

మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం మండలాల్లో ఖరీఫ్ సాగును నెల రోజులు ఆలస్యంగా మొదలుపెట్టారు. ఇక్కడి మూడు మండలాల్లో 16,698 హెక్టార్లు సాధారణ విస్తీర్ణం కాగా, 6,679 హెక్టార్లలో నాట్లు వేశారు. ప్రస్తుతం బుచ్చెంపేట, గుమ్ములూరు. బూరుగుపూడి, మునగాల, శ్రీరంగపట్నం, ములకల్లంక, బొబ్బిల్లంక, మిర్తిపాడు, ఉండేశ్వరపురం గ్రామాల్లోని సుమారు 5 వేల ఎకరాల్లో వరి నీటమునిగింది. దీంతో కోరుకొండ, సీతానగరం మండలాల్లోని 9 గ్రామాలకు చెందిన సుమారు 1,200 మంది రైతులకు పంటనష్టం ఏర్పడనుంది. ఇక్కడ ఎంటీయూ 1,318, బీపీటీ 5,204, పీఎల్ఏ 1,100, ఎంటీయూ 1,061, 1,064 రకాలను సాగు చేశారు. ఈ సంవత్సరం అత్యధికంగా ఎంటీయూ 1,318 రకాన్ని వినియోగించారు.

వారం రోజుల్లో తగ్గితే పర్వాలేదు



పొలాల్లోని వరద నీరు వారం రోజుల్లో తగ్గితే ఫర్వాలేదు. లేదంటే పంట నాశనమవుతుంది. గోదావరి ఉధృతి తగ్గిన తర్వాత పొలాల్లోని నీరంతా వెనక్కు పోవాలి. లేదంటే ఇప్పటికే 40 శాతం పూర్తయిన వరినాట్లు నాశనమవుతాయి. అదే జరిగితే మళ్లీ సాగుకు సన్నద్ధమవ్వాలి.

– బీకే మల్లికార్జునరావు, ఏడీఏ, కోరుకొండ

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే..



బురద కాలువపైన సీతానగరం మండలం బొబ్బిల్లంక, మిర్తిపాడు గ్రామాల మధ్య డ్యామ్ నిర్మించడం ద్వారా ముంపు బెడదను శాశ్వతంగా పరిష్కరించవచ్చు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే వరద ముంపు సమస్య వచ్చింది. బురద కాలువపై చిన్నపాటి తూరలు ఏర్పాటు చేయడంతో నీరు వెనక్కు వెళ్లడం లేదు.

– నక్కా రాంబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్

మునిగిన వరి నాట్లు



ఈ ఏట సాగు ఆలస్యంగా ప్రారంభమైంది. దీనికి తోడు గోదావరి వరదనీటి ఎగపోటు సమస్య ఏర్పడింది. 40 శాతం పూర్తయిన నాట్లు నీటమునిగాయి. వరద నీరు త్వరగా తగ్గితే పర్వాలేదు. కానీ ఎక్కువ రోజులు ఉంటే మాత్రం పంట నష్టం జరుగుతుంది. గోదావరి ఎగపోటుతో సమస్య వస్తోంది.

– క్రొవ్విడి సత్రాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మధురపూడి: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే జనసేన నాయకుడు బత్తుల బలరామకృష్ణ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గాడాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బూరుగుపూడి ఆవ భూములను ఇళ్ల స్థలాలుగా తీసుకున్న వ్యవహారంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాత్రలేదన్నారు. భూముల విషయమై న్యాయస్థానం తీర్పు ఇచ్చినా నిసిగ్గుగా ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. ఆరోపణలను రుజువు చేయగల్గితే రాజకీయ సన్యాసం చేస్తామని సవాల్ విసిరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు మాట్లాడుతూ రాజకీయ కుటుంబానికి చెందిన రాజాపై ఆరోపణలు చేయడం ద్వారా ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నం చేయడాన్ని ఆక్షేపించారు. జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పార్టీ కో కన్వీనర్ గణేశుల పోసి, సర్పంచ్‌ల సమాఖ్య మండలాధ్యక్షుడు కడియాల పాపారావు, నాయకుడు ఈలి మూర్తి పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పథకాల అమలు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కొంకుదురులో గడప గడపకూ..


కొంకుదురులో పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కొంకుదురు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ప్రజలను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పథకాల అమలులో పారదర్శకత కోసం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే సొమ్ము జమ చేస్తున్నారని తెలిపారు. గత టీడీపీ హయాంలో ఆ పార్టీ కార్యకర్తలకే సంక్షేమ ఫలాలు అందేవన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా ఇంటి వద్దకే సంక్షేమ వసంతం వచ్చిందన్నారు. పారదర్శక పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు. సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపీటీసీ సభ్యులు కొంకుదురు పీవీ, నల్లమిల్లి అమ్మిరెడ్డి, పార్టీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డిరాజా, పందలపాక సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, నాయకులు సత్తి బుల్లివీర్రెడ్డి, మల్లిడి కోదండం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గోకవరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: ప్రభుత్వం అర్హులందరికీ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే చంటిబాబు పాల్గొని ప్రసంగించారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మండలంలో 34 వేల మందికి సర్టిఫికెట్లు అందజేశామన్నారు. వీటి ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో గాదెలపాలెం సర్పంచ్ కమ్మెల అచ్చిబాబు మాట్లాడుతూ గతంలో తమ గ్రామం మీదుగా రాజమహేంద్రవరానికి ఆర్టీసీ బస్సు సర్వీసు ఉండేదని, ప్రస్తుతం ఈ సర్వీసు స్థానంలో కాకినాడకు వెళ్లే సర్వీసు ఏర్పాటు చేయడంతో రాజమహేంద్రవరం వెళ్లి చదువుకునే విద్యార్థులు రెండు బస్సులు మారాల్సి వస్తోందన్నారు. సర్వీసును యథావిధిగా పునరుద్ధరించాలని కోరారు. జగనన్న కాలనీలకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడంలో ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, కామరాజుపేటలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆయా శాఖ అధికారులను ఆదేశించారు. గోకవరం నుంచి తంటికొండ, గాదెలపాలెం, ఇటికాయలపల్లి మీదుగా రాఘవపురం వెళ్లేందుకు రూ.10.50 కోట్లతో రోడ్డు మంజూరైందని ఆర్‌అండ్‌బీ జేఈ వీరన్న తెలిపారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు


గోకవరంలో మునగ మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు


జి.మామిడాడలో మొక్కలు నాటిన ఎంపీపీ తులసి తదితరులు

గోకవరం: పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకుని మొక్కలు నాటాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సూచించారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గోకవరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ఐదు వేల మునగ మొక్కలను మహిళలకు పంపిణీ చేశారు. అనంతరం కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని ఎమ్మెల్యే కోరారు. జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, కర్రి సూరారెడ్డి, నరాలశెట్టి నర్సయ్య, ఎంపీడీఓ పద్మజ్యోతి, తహసీల్దార్ సుగుణ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణ

పెదపూడి: పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎంపీపీ కేతా తులసి అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జి.మామిడాడలోని జగనన్న కాలనీల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఎంపీపీ తులసి, ఎంపీడీఓ విజయభాస్కర్ తదితరులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడవులు నరికివేత, ఫ్యాక్టరీల నుంచి విడుదలయ్యే పొగతో వాతావరణం కాలుష్యం బారిన పడుతుందన్నారు. ప్రకృతి పరిరక్షణకు అంతా బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. సర్పంచ్ లంక మున్ని, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కడిమి శ్రీను, సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ కేతా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఇలపల్లి సర్పంచ్ లోల్లం భద్రం అన్నారు. గ్రామ అక్కమ చెరువు వద్ద అమృత్ సరోవర్‌లో భాగంగా 100 మొక్కలు నాటారు. అలాగే బలభద్రపురంలో వంద మొక్కలను సర్పంచ్ బుంగా రామారావు, ఉపాధి హామీ ఏపీవో వెంకటేశ్వరరావు తదితరులు నాటారు.

మానవుల మనుగడకు ప్రకృతే ఆధారం

సీతానగరం: మానవుల మనుగడకు ఆధారమైన ప్రకృతిని పరిరక్షించుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ ముండూరి మల్లికార్జునరావు, పర్యావరణవేత్త గంటి సత్తిరాజు అన్నారు. వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్ఎం ఎల్.సీతారత్నం అధ్యక్షతన శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణహితంగా పేపర్ పెన్నులు వినియోగించాలన్నారు. వాటిని తయారు చేసే విధానాన్ని వివరించారు.

▸▸ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సీతానగరం డిగ్రీ కళాశాల విద్యార్థులు బస్టాండ్‌లోని వ్యర్థాలను తొలగించారు. ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టిబాబు సూచనల మేరకు లెక్చరర్లు ఈఎస్ఎస్ ఆర్ శర్మ, సలాది శివాజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

▸▸ పర్యావరణ పరిరక్షణే ప్రతి ఒక్కరి ధ్యేయం కావాలని ఎంపీడీవో కె.రమేష్ అన్నారు. రఘుదేవపురం గ్రామ సచివాలయంలో శుక్రవారం ఆయన మొక్కలు నాటారు. అనంతరం రాపాకలో బీసీ, ఎస్సీ కమ్యూనిటీ హాలును సందర్శించారు. త్వరలోనే కమ్యూనిటీ హాల్ పనులను పూర్తి చేస్తామన్నారు. బంగారు కొండ కార్యక్రమంలో భాగంగా రాపాకకు చెందిన రష్మిక ఇంటికి వెళ్లి, తల్లి మానికతో మాట్లాడి పాప ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గెద్దాడ త్రిమూర్తులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు

రంగంపేట: మొక్కలు నాటడం అందరి బాధ్యతని గ్లోబల్ విజన్ పాఠశాల కరస్పాండెంట్ జాన్‌డీన్ అన్నారు. నల్లమిల్లిలో స్కిన్నర్ దార్దెన్ వ్యవస్థాపకుడు శామ్యూల్‌రాజు జయంతి సందర్భంగా ఆ పాఠశాల ఆవరణలో జాన్‌డీన్, ప్రిన్సిపాల్ సత్యవాణి మొక్కలు నాటారు.

ఉధృతంగా గోదావరి ప్రవాహం


ములకల్లంక వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి


ములకల్లంకలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ ఏసురాణి


మునికూడలి ఘాట్‌ను తాకుతూ వెళుతున్న వరద

- అధికారుల అప్రమత్తం
- పరిస్థితిని సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రాజా

సీతానగరం: అఖండ గోదావరికి వరద ఉధృతి మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో వివిధశాఖాధికారులను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అప్రమత్తం చేశారు. మరో ఐదు అడుగుల నీటిమట్టం పెరిగితే ములకల్లంక గ్రామంలోకి నీరు చేరడం ప్రారంభిస్తుంది. కాగా.. ఆ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రజాక్ ఆధ్వర్యంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో వైద్యశిబిరం ఏర్పాటు చేసి బొబ్బిల్లంక పీహెచ్‌సీ డాక్టర్ ఏసురాణి వైద్యసేవలు అందించారు. ఇందులో 24 గంటలూ వైద్య సేవలు అందించనున్నారు. బొబ్బిల్లంక – ములకల్లంక గ్రామాల మధ్య అధికారులు ఏర్పాటు చేసిన రెండు బోటులలో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. మునికూడలి ఘాట్ వద్ద గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. బొబ్బిల్లంకలోని ప్రభాకర్ నగర్ జిల్లా పరిషత్ హైస్కూల్, రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడు హైస్కూల్‌ను పునరావాస కేంద్రాలుగా ఎంపిక చేశామని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణరాజు, ఎంపీడీవో కె.రమేష్‌లు తెలిపారు.

ఆర్‌బీకేల్లో ఎరువులు సిద్ధం

అనపర్తి: ఆర్‌బీకేల్లో నాణ్యమైన ఎరువులు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి బి.సురేష్ కుమార్ శుక్రవారం తెలిపారు. ప్రస్తుత సార్వాలో మొదటి దఫా, రెండో దఫా రైతులు పిండి వేసే సమయంలో అధికంగా యూరియా, డీఏపీను వాడుతున్నారన్నారు. ఆర్‌బీకేల్లో కూడా కోరమాండల్, మొజాయిక్ డీఏపీలు లభ్యమవుతున్నాయని వివరించారు. డీఏపీ కంపెనీని బట్టి రంగు ఉంటుందన్నారు. అన్ని కంపెనీల డీఏపీల్లో 18 శాతం నత్రజని, 46 శాతం భాస్వరం ఉంటాయన్నారు. రైతులు ఎటువంటి సందేహం లేకుండా పైకంపెనీల డీఏపీ ఎరువు ఒకే రకమైన ఫలితాన్ని ఇస్తాయని గ్రహించాలన్నారు.

దేశాభివృద్ధిలో యువత కీలకం


పావనిని సత్కరిస్తున్న జీఎస్ఎల్ డెంటల్ కళాశాల ప్రతినిధులు

రాజానగరం: దేశాభివృద్ధిలో యువతను భాగస్వాములు చేయడం కోసమే కేంద్ర ప్రభుత్వం 'ఉన్నత్ భారత్ అభియాన్' (యూబీఏ) కార్యక్రమాన్ని రూపొందించిందని యూబీఏ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఛీకొట్టి పావని అన్నారు. నోడల్ అధికారి ప్రొఫెసర్ నాగరాజుతో కలిసి స్థానిక జీఎస్ఎల్ దంత వైద్య కళాశాలలో శుక్రవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలను విద్యార్థులే ఎంచుకుని సర్వే చేయడం, సమస్యలను విశ్లేషించి, పరిష్కారాలు సూచించడం యూబీఏలో ప్రధాన కర్తవ్యమన్నారు. అనంతరం డాక్టర్ పావనిని జీఎస్ఎల్ ఎండీ డాక్టర్ గన్ని సందీప్, డీన్ వైవీ శర్మ, ప్రిన్సిపాల్ జి.సునీల్ సత్కరించారు.